## మోదీ సభల వద్ద నిరసనలొద్దు

- రైతులకు బీజేపీ విజ్ఞప్తి

చండీగఢ్: ప్రధాని మోదీ పంజాబ్‌లో నిర్వహించే ఎన్నికల ప్రచార సభల వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని రైతు సంఘాలు నిర్ణయించాయి. దీంతో బీజేపీ ఆందోళనకు గురవుతున్నది. రైతుల డిమాండ్లను మోదీ సానుకూలంగా పరిశీలిస్తారని హామీ ఇస్తున్నామని బీజేపీ నేతలు తెలిపారు. మోదీ సభలకు అంతరాయం కలిగించడానికి బదులుగా సమస్యలపై చర్చించుకుని, ఓ వినతి పత్రాన్ని తమకు ఇవ్వాలని రైతు సంఘాల నేతలకు విజ్ఞప్తి చేశారు. 23, 24 తేదీల్లో మోదీ ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు.

ప్రసంగాల్లో బీజేపీ!

### క్యాన్సర్ కంటే ప్రమాదకర వ్యాధులు



'విపక్ష ఇండియా కూటమికి క్యాన్సర్ కంటే ప్రమాదకరమైన మూడు వ్యాధులు ఉన్నాయి. అవి మతతత్వం, జాత్యహంకారం, బంధుప్రీతి. వారి విస్తరణ జరిగితే దేశం మొత్తాన్ని నాశనం చేస్తారు. 60 ఏండ్లలో ఏం చేయని విపక్షం.. ఇప్పుడు ప్రధాని మోదీని, అతని పనిని అడ్డుకొనేందుకు ఏకం అయ్యాయి. యూపీలో ఇద్దరు బాలురి(కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్‌లను ఉద్దేశించి) ఫ్లాప్ సినిమాను తిరిగి లాంచ్ చేశారు. ఈ ఇద్దరు యువ రాజులు మోదీ చేసిన పనులను రద్దు చేస్తారు'

**-బుధవారం యూపీలోని శ్రావస్తిలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రధాని మోదీ**

### 30 సీట్లు గెలిస్తే.. టీఎంసీ విచ్ఛిన్నం



'పశ్చిమబెంగాల్‌లో 42 సీట్లకు బీజేపీ 30 స్థానాలను గెలుచుకొంటే.. రాష్ట్రంలోని అధికార టీఎంసీ విచ్ఛిన్నం అవుతుంది. మమతా బెనర్జీ ప్రభుత్వం నిష్క్రమించడం ఖాయం. మమత ప్రభుత్వంలో రాష్ట్రం చొరబాటుదారులకు స్వర్గధామంగా మారింది. ఈ చొరబాటుదారుల అంశం ఒక్క బెంగాల్‌కే కాకుండా దేశానికి ఆందోళనకరం. మమత తన ఓటు బ్యాంకు రాజకీయాల కోసం దేశ భద్రతను పణంగా పెడుతున్నారు. అదే విధంగా రాష్ట్రంలో ఎన్నికల హింస ప్రజాస్వామ్యాన్ని బలహీనం చేసింది'

**- బుధవారం పూర్బ మేదినిపూర్ జిల్లాలో జరిగిన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా**

ఢిల్లీలో నీళ్ల రాజకీయం!

### ఢిల్లీలో నీటి కొరతకు బీజేపీ కుట్ర



హర్యానాలోని వాళ్ల రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఢిల్లీకి యమునా నది నీటి సరఫరాను బంద్ చేసి బీజేపీ 'కొత్త కుట్ర'కు తెర లేపింది. ఆప్ ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బ తీసేందుకు, ఢిల్లీ ప్రజలను ఇబ్బందులకు గురిచేసేందుకు బీజేపీ ఇలా చేస్తున్నది. లోక్‌సభ ఎన్నికల ప్రకటన వచ్చిన నాటి నుంచి ఆప్, కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా బీజేపీ పలురకాలుగా కుట్రలు పన్నుతున్నది. కేజ్రీవాల్ అరెస్టు, స్వాతి మలివాల్ అంశం, ఆప్‌నకు విదేశీ విరాళాల ఆరోపణలు అందులో భాగమే.

**- ఆతిశీ, ఆప్ నేత, ఢిల్లీ మంత్రి**

### ఆప్ అవినీతి, అసమర్థత వల్లే..



ఆప్ ప్రభుత్వ అవినీతి, ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఢిల్లీలో నీటి కొరత సమస్య తలెత్తింది. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి భయంతో ఆప్ కొత్త అబద్ధపు ప్రచారాన్ని ప్రారంభించింది. మేము నీటి సమస్య అంశాన్ని సోమవారం లేవనెత్తినప్పుడు.. మంత్రి ఒక్క మాట కూడా మాట్లాడకుండా, ఇప్పుడు బీజేపీపై నిందలు వేస్తున్నారు. నీటి కొరత సమస్యపై కేజ్రీవాల్ రాసిన లేఖకు సంబంధించి, మంత్రి గత నెల రోజులుగా ఏం చర్యలు తీసుకొన్నారు?

**-వీరేంద్ర సచ్‌దేవ, బీజేపీ ఢిల్లీ అధ్యక్షుడు**

# కాంగ్రెస్ పాలనలో రైతు బలి

- అప్పు కింద రైతు భార్యబిడ్డలను నిర్బంధించిన వడ్డీ వ్యాపారి
- అవమానాన్ని తట్టుకోలేక అన్నదాత బలవన్మరణం



రాజు రామప్ప ఖోటాగి

బెంగళూరు, మే 22: తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు వచ్చినప్పటి నుంచి రైతులకు కష్టాలు మొదలవగా, కర్ణాటకలోనూ ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. తాజాగా కర్ణాటకలో ఓ రైతు కుటుంబానికి దారుణ అవమానం జరిగింది. ఆ అవమానాన్ని తట్టుకోలేక రైతు బలవన్మరణానికి ఒడిగట్టాడు. ఈ దారుణ ఘటన కర్ణాటకలోని బెల్గావి జిల్లా హుక్కెరి తాలుకా ఇస్లాంపూర్ గ్రామంలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. ఇస్లాంపూర్‌కు చెందిన రాజు రామప్ప ఖోటాగి (55) అనే రైతు స్థానిక వడ్డీవ్యాపారి సిద్దవ్వ బయ్యనవర వద్ద ఆరు నెలల క్రితం రూ.1.50 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఆ సమయంలో గ్యారెంటీగా చెక్కులు అందజేశాడు. ఆదివారం రాజు కుటుంబానికి తన ఇంటికి పిలిపించుకున్న సిద్దవ్వ వడ్డీతోసహా అప్పు చెల్లించాలని ఆదేశించాడు. కరువు వల్ల పంట చేతికి అందలేదని, అప్పు చెల్లించడానికి మరికొంత సమయం ఇవ్వాలని రైతు కోరాడు. కానీ, సిద్దవ్వ.. రాజు భార్యతోపాటు కుమారుడిని నిర్బంధించాడు. అప్పు చెల్లించి భార్యను కొడుకును విడిపించుకెళ్లాలని హుకుం జారీ చేశాడు. ఆ అవమానం తాళలేక రైతు ఇంటికి వెళ్లి పురుగుల మందు తాగాడు. చికిత్స పొందుతూ సోమవారం చనిపోయారు.

## కేంద్ర హోంశాఖకు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ: ఢిల్లీలో బాంబు బెదిరింపులు కొనసాగుతున్నాయి. మొదట స్కూళ్లు, తర్వాత ఎయిర్‌పోర్టుల్లో బాంబులు పెట్టామని బెదిరించిన ఆగంతకులు ఇప్పుడు ఏకంగా కేంద్ర హోంశాఖ కార్యాలయాన్నే పేల్చేస్తామని బెదిరించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆధీనంలో ఉన్న నార్త్ బ్లాక్‌లోని రోడ్ స్టోన్ బిల్డింగ్‌ను పేల్చేస్తామని ఈమెయిల్‌లో హెచ్చరించినట్టు తెలుస్తున్నది. బాంబు స్క్వాడ్ తనిఖీలు చేపట్టగా ఎలాంటి పేలుడు పదార్థాలు లభ్యం కాలేదు. కాగా, ఈ నెలలో ఢిల్లీలోని దాదాపు 150 స్కూళ్లకు ఇలానే బాంబు బెదిరింపులు వచ్చాయి. హంగరీ రాజధాని బుడాపెస్ట్ నుంచి ఈ ఈమెయిళ్లు వచ్చినట్టు ఢిల్లీ పోలీసులు మంగళవారం వెల్లడించారు.

# రెచ్చగొట్టే ప్రసంగాలేల?

**బీజేపీ, కాంగ్రెస్ ఎన్నికల ప్రచార తీరుపై ఈసీ ఫైర్**




న్యూఢిల్లీ, మే 22: లోక్‌సభ ఎన్నికల ప్రచార సభలలో అటు అధికారంలోని బీజేపీ, ఇటు విపక్ష కాంగ్రెస్ పార్టీలు ఓటర్లను రెచ్చగొట్టేలా చేస్తున్న ప్రసంగాలను ఎన్నికల కమిషన్ తప్పుబట్టింది. ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీలు సహా ఆయా పార్టీలు స్టార్ క్యాంపెయినర్లు ఎన్నికల సభలలో చేస్తున్న ప్రసంగాలపై అభ్యంతరం తెలుపుతూ ఇకనైనా వాటిని సరిదిద్దుకోవాలని హెచ్చరించింది. ఉద్రిక్తతలను పెంచే ప్రసంగాలను దూరం పెట్టాలని, ప్రచారంలో సంయమనాన్ని పాటించాలని కోరింది. దేశంలోని రెండు ప్రధాన పార్టీలు కులం, మతం, భాష, ప్రాంతీయత్వం, రాజ్యాంగం వంటివి ప్రధాన అంశాలుగా చేసుకుని ప్రచారం చేస్తున్నాయని గుర్తు చేసింది. కుల, మతాల మధ్య విభజనకు దారితీసే అంశాలు, రాజ్యాంగం రద్దు లాంటి అంశాలను ఈ ప్రధాన పార్టీలు తమ ప్రచారంలో ప్రధానంగా ఉంచడాన్ని ఎన్నికల సంఘం తప్పుబట్టింది. ఇలాంటి అంశాలపై ప్రచారం సాగిస్తూ ఆయా వర్గాలలో ఉద్రిక్తతలు పెంచవద్దని కోరింది. ఈ విషయంలో పార్టీ అధ్యక్షులు తమ స్టార్ క్యాంపెయినర్లను రెచ్చగొట్టే ప్రసంగాలకు దూరంగా ఉండాలంటూ ఆదేశాలు జారీ చేయాలని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేలను ఎన్నికల సంఘం ఆదేశించింది.

## 'ఆ మసాలాల్లో ఇథిలీన్ ఆక్సైడ్ ఆనవాళ్లు లేవు'




న్యూఢిల్లీ: ఎండీహెచ్, ఎవరెస్ట్ బ్రాండ్ల మసాలా శాంపిళ్లలో ఇథిలీన్ ఆక్సైడ్ ఆనవాళ్లు కనిపించలేదని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) అధికారులు బుధవారం వెల్లడించారు. ఈ రెండు కంపెనీలకు చెందిన వివిధ రకాల మసాలా, కర్రీ పౌడర్లలో పరిమిత స్థాయికి మించి ఇథిలీన్ ఆక్సైడ్ ఉన్నట్టు పేర్కొంటూ హాంకాంగ్, సింగపూర్, నేపాల్, మాల్దీవ్స్ తదితర దేశాలు వాటి అమ్మకాలను, దిగుమతులను నిషేధించిన విషయం విదితమే. దీంతో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఆయా మసాలా పౌడర్ల శాంపిళ్లను సేకరించి, 28 అక్రెడిటెడ్ ల్యాబొరేటరీల్లో పరీక్షించింది.



- **పనిలో పనిగా..!**

*నేటి కాలంలోని హడావుడి జీవితానికి ఈ ఫొటో ఒక ఉదాహరణగా చెప్పొచ్చు. తాజాగా బెంగళూరులో ఓ మహిళ ఓవైపు ల్యాప్‌టాప్‌లో టీమ్ మీటింగ్‌కు హాజరవుతూనే.. మరోవైపు ఒక చెప్పుల దుకాణంలో ఇలా షాపింగ్ చేస్తూ కనిపించింది. ఈ ఫొటోను కొంతమంది నెటిజన్లు సరదాగా చూడగా.. మరికొంతమంది ఇది విచారకరమని అభిప్రాయపడ్డారు.*

# మలేరియాకు కొత్త టీకా!

- అభివృద్ధి చేస్తున్న జేఎన్‌యూ శాస్త్రవేత్తలు



న్యూఢిల్లీ: మలేరియా నిర్మూలన కోసం టీకాను అభివృద్ధి పరచడంలో ఢిల్లీలోని జేఎన్‌యూ శాస్త్రవేత్తలు గొప్ప ముందడుగు వేశారు. మరింత సమర్థంగా మలేరియా నిరోధం, చికిత్సకు బాటలు వేశారు. ప్రొఫెసర్ శైలజ సింగ్, ప్రొఫెసర్ ఆనంద్ రంగనాథన్ ఆధ్వర్యంలో ఈ పరిశోధన జరిగింది. యాంటీ మలేరియల్ డ్రగ్స్ ప్రభావాన్ని నిరోధించగలిగే రోగ నిరోధక సామర్థ్యాన్ని దోమలు ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకుంటున్నాయి. మరోవైపు మలేరియాకు సమర్థవంతమైన టీకాలు లేవు. దీంతో ఈ ప్రాణాంతక మహమ్మారితో పోరాటంలో ప్రగతికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. దీనిపై ప్రొఫెసర్ శైలజ మాట్లాడుతూ..మనిషిలో ఇన్ఫెక్షన్‌ను చొప్పించడానికి దోహదపడే రెండు తటస్థ అణువులు పీహెచ్‌బీ2-హెచ్ఎస్‌పీ70ఏ1ఏను గుర్తించినట్లు తెలిపారు. ఈ పారాసైట్ ప్రొటీన్ పీహెచ్‌బీ2 ఓ ప్రభావవంతమైన వ్యాక్సిన్‌కు దోహదం చేసే కారణం కాగలదన్నారు. వివిధ సెల్యులార్ ప్రాసెస్‌లను నిర్వహించడంలో కీలక పాత్ర పోషించే ప్రొటీన్ల కుటుంబం ప్రొహిబిటిన్స్ అని చెప్పారు. మరో పరిశోధకుడు మనీషా మరోథియా మాట్లాడుతూ, పీఎఫ్‌పీహెచ్‌బీ2 యాంటీబాడీల ఉనికి మలేరియా చికిత్సలో గొప్ప మలుపు అని చెప్పారు.

# న్యాయంగా విచారణ జరగాలి

- స్వాతి మలివాల్‌పై దాడి ఘటనపై కేజ్రీవాల్ స్పందన

న్యూఢిల్లీ, మే 22: ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీ స్వాతి మలివాల్ మీద దాడి ఘటనపై ఆ పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మొదటిసారి స్పందించారు. బుధవారం పీటీఐ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం ఈ అంశం విచారణ దశలో ఉన్నందున తాను స్పందిస్తే విచారణపై ప్రభావం పడుతుందని అన్నారు. అయితే, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరగాలని, న్యాయం చేయాలని మాత్రం తాను ఆశిస్తున్నట్టు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి రెండు రకాల వాదనలు ఉన్నందున పోలీసులు ఇరువైపుల వాదనలపై విచారణ జరిపి, న్యాయం చేయాలని పేర్కొన్నారు.

## కేరళలో అంతర్జాతీయ అవయవ రాకెట్

**పోలీసుల అదుపులో నిందితుడు • బాధితుల్లో హైదరాబాద్ వాసులు**

తిరువనంతపురం, మే 22: కేరళలో అంతర్జాతీయ అవయవ రాకెట్ ఒకటి బయటపడింది. హైదరాబాద్, బెంగళూరుతో పాటు పలు ప్రాంతాలకు చెందిన 20 మంది ఈ ముఠా బారిన పడి అవయవాలు పోగొట్టుకున్న వైనం వెలుగు చూసింది. ఇరాన్ నుంచి త్రిస్సూర్‌కు చెందిన సబిత్ నాజర్(30)ను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. అతను ఇప్పటివరకు కేరళతో పాటు హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలకు చెందిన 20 మందిని గత ఐదు ఏండ్లుగా అక్రమంగా ఇరాన్ తరలించి వారి కిడ్నీలను అమ్మేవాడని, 5 లక్షలు కమీషన్‌గా తీసుకునేవాడని పోలీసులు తెలిపారు.











